# జీఎస్టీ వసూళ్లు 1.77 లక్షల కోట్లు


**గతంతో పోల్చితే డిసెంబర్‌లో 7.3 శాతం వృద్ధి**




న్యూఢిల్లీ, జనవరి 1:వస్తు, సేవల పన్ను వసూళ్లు అంతకంతకు పెరుగుతున్నాయి. గడిచిన సంవత్సరం చివరి నెలలో రూ.1.77 లక్షల కోట్ల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. దీంట్లో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.32,836 కోట్లు వసూలవగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.40,499 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.47,783 కోట్లు, సెస్ రూపంలో రూ.11,471 కోట్లు వసూలయ్యాయి. అలాగే రూ.22,490 కోట్లు రిఫండ్ రూపంలో చెల్లింపులు జరిపింది. మొత్తంగా డిసెంబర్‌లో రూ.1.77 లక్షల కోట్లు వసూలైనట్లు, క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.1.65 లక్షల కోట్లతో పోలిస్తే 7.3 శాతం అధికమని పేర్కొంది. దీంట్లో దేశీయంగా జరిపే లావాదేవీలపై విధించిన జీఎస్టీతో రూ.1.32 లక్షల కోట్లు సమకూరగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధిస్తున్న పన్నులతో మరో రూ.44,268 కోట్లు సమకూరాయి. నవంబర్ నెలలో రూ.1.82 లక్షల కోట్ల పన్ను వసూలైంది. జీఎస్టీ అమలులోకి వచ్చిన తర్వాత ఏప్రిల్ 2024లో అత్యధికంగా రూ.2.10 లక్షల కోట్లు వసూలయ్యాయి.

# జోరుగా యూపీఐ లావాదేవీలు

**డిసెంబర్‌లో 8% ఎగిసి రూ.23 లక్షల కోట్లకు**





న్యూఢిల్లీ, జనవరి 1: దేశంలో ఆన్‌లైన్ పేమెంట్స్ జోరుగా సాగుతున్నాయి. యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీలు గత నెల డిసెంబర్‌లో 8 శాతం ఎగిసి 1,673 కోట్లుగా నమోదయ్యాయి. భారత్‌లో యూపీఐ లావాదేవీలు మొదలైన (2016 ఏప్రిల్) దగ్గర్నుంచి ఇదే అత్యధికం కావడం గమనార్హం. వీటి విలువ కూడా 8 శాతం ఎగబాకి రూ.23.25 లక్షల కోట్లకు చేరింది. నిరుడు అక్టోబర్ (రూ.23.50 లక్షల కోట్లు) తర్వాత ఇదే గరిష్ఠం. నవంబర్‌లో రూ.21.55 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇక నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) వివరాల ప్రకారం గత ఏడాది మొత్తంగా దేశంలో 17,200 కోట్ల యూపీఐ లావాదేవీలు జరిగాయి. 2023తో పోల్చితే ఇది 46 శాతం ఎక్కువ. నాడు 11,800 కోట్లే లావాదేవీలే. విలువపరంగా చూస్తే.. రూ.183 లక్షల కోట్ల నుంచి రూ.247 లక్షల కోట్లకు పెరిగింది. దీంతో 35 శాతం వృద్ధిచెందినట్టైంది. కాగా, నవంబర్‌తో పోల్చితే రోజువారీ లావాదేవీలు డిసెంబర్‌లో 51.6 కోట్ల నుంచి 54 కోట్లకు పెరిగాయి. విలువ కూడా రూ.71,840 కోట్ల నుంచి రూ.74,990 కోట్లకు ఎగిసింది. ఇదిలావుంటే ఐఎంపీఎస్ లావాదేవీలు నవంబర్‌తో చూస్తే డిసెంబర్‌లో 8 శాతం పుంజుకొన్నాయి.

# ఈవీలపై రాయితీల వర్షం

**కస్టమర్లను ఆకట్టుకునేందుకు భారీగా డిస్కౌంట్లు**

## టాటా, మహీంద్రా, హీరో, ఏథర్ వాహనాలు చౌక

## పాపులర్ మాడళ్లపై రూ.3 లక్షలదాకా తగ్గింపు



న్యూఢిల్లీ, జనవరి 1: విద్యుత్తు ఆధారిత వాహన (ఈవీ) ధరలు దిగొస్తున్నాయి. మార్కెట్‌లోని టాప్ కంపెనీలు తమ పాపులర్ మాడళ్లపై భారీ రాయితీలను ప్రకటించాయి. టాటా, మహీంద్రా, హీరో, ఏథర్ సంస్థలు ఆయా ఈవీలపై ఏకంగా రూ.3 లక్షలదాకా రేట్లను తగ్గించడం విశేషం. డిస్కౌంట్లున్న ఈవీల్లో కార్లు, బైకులు కూడా ఉండటం గమనార్హం. సంప్రదాయ ఇంధన (పెట్రోల్ లేదా డీజిల్) ఆధారిత వాహనాలు కాలుష్యానికి దారి తీస్తున్న నేపథ్యంలో అటు వాహనదారులు, ఇటు ప్రభుత్వాలు ఈవీల కొనుగోళ్లను ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే గత కొన్నేండ్లుగా ఆటో అమ్మకాల్లో ఈవీల వాటా సైతం పెరిగింది. అయినప్పటికీ ఈవీలపై తయారీదారులు పెద్ద ఎత్తున డిస్కౌంట్లు ప్రకటించడం మారిన మార్కెట్ పరిస్థితులకు అద్దం పడుతున్నది.

**ఇదీ సంగతి..**

డిమాండ్‌కు మించి పెరిగిన ఉత్పత్తి, డీలర్ల వద్ద పేరుకుపోయిన వాహన నిల్వలు, తగ్గిన విడిభాగాల ధరలు.. మార్కెట్‌లో ఎలక్ట్రిక్ వెహికిల్స్ రేట్లపై డిస్కౌంట్లకు కారణమయ్యాయి. కొత్తగా వచ్చిన కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయెల్ ఎఫీషియెన్సీ (కేఫ్) రెగ్యులేషన్లు కూడా ఇప్పుడున్న మాడళ్లపై ధరల తగ్గింపు దిశగా కంపెనీలను నడిపించాయని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి. ఈ క్రమంలోనే టాటా నెక్సాన్, మహీంద్రా ఎక్స్‌యూవీ400, హీరో వీ1 ప్రో-వీ1 ప్లస్, ఏథర్ 450-రిజ్టా మాడళ్లు చౌకయ్యాయని పేర్కొంటున్నాయి. చివరకు ఆన్‌లైన్ మార్కెటీర్ ఫ్లిప్‌కార్ట్ కూడా ఎలక్ట్రిక్ టూవీలర్లపై రూ.2,500-5,000 మేర ధరల్ని తగ్గించేసింది. ఇక ఈ డిస్కౌంట్లలో ఎక్కువ భాగం వాహన తయారీ సంస్థలు భరిస్తుండగా, మిగతా వాటాను డీలర్లు మోస్తున్నారు. ఎక్స్చేంజ్ బోనస్‌లు రూ.15,000 వరకు ఇస్తుండగా, ట్రేడ్ డిస్కౌంట్లు రూ.3,000-5,000 మధ్య ఉన్నాయి. మొత్తానికి దసరా, దీపావళి, క్రిస్మస్, న్యూ ఇయర్ జోష్‌ను అందిపుచ్చుకున్న వాహన రంగ కంపెనీలు.. పొంగల్, సంక్రాంతి ఉత్సాహాన్నీ క్యాష్ చేసుకోవాలని చూస్తున్నాయి.

**ఎలక్ట్రిక్ వాహనాలపై రాయితీలు ఇలా..**

| | | |
|---|---|---|
| టాటా | నెక్సాన్ | ₹3,00,000 |
| మహీంద్రా | ఎక్స్‌యూవీ400 | ₹3,00,000 |
| హీరో వీ1 ప్రో | | ₹25,000 |
| హీరో వీ1 ప్లస్ | | ₹10,000 |
| ఏథర్ 450 | | ₹5,000-7,000 |
| ఏథర్ రిజ్టా | | ₹3,000-6,700 |

## ఈ ఏడాది 15 కొత్త మాడల్స్

ఈ ఏడాది దేశీయ మార్కెట్‌లోకి ఏకంగా 15 కొత్త ఈవీలు రావచ్చని సమాచారం. అందులో మారుతీ సుజుకీ నుంచి ఈ-విటారా కూడా ఉండొచ్చని తెలుస్తున్నది. ఇక ఇప్పటికే దేశీయ ఈవీ మార్కెట్‌ను శాసిస్తున్న టాటా మోటర్స్ నుంచి సఫారీ, హరియర్ ఈవీ రకాలు రావచ్చని అంటున్నారు. అలాగే సియెర్రా ఈవీ పరిచయం కాబోతున్నట్టు చెప్తున్నారు. ఈ రెండు నెలల్లోనే ఇవి మార్కెట్‌కు వస్తాయని అంచనా. గత ఏడాది పంచ్, కర్వ్ ఈవీలను మార్కెట్‌లోకి టాటా తీసుకొచ్చిన సంగతి విదితమే. మరోవైపు మహీంద్రా నుంచి ఎక్స్‌యూవీ700, ఎక్స్‌యూవీ4ఎక్స్‌వో ఈవీలు రావచ్చని తెలుస్తోంది. ఇక హ్యుందాయ్ పాపులర్ మాడల్ క్రెటా కూడా ఈవీగా అందుబాటులోకి రాబోతున్నది. కియా ఈవీ5, ఎంజీ సైబర్‌స్టార్ వంటివి కూడా ఈ లిస్టులో ఉన్నాయి. కాగా, 2030 నాటికి భారతీయ మార్కెట్‌లో ఎలక్ట్రిక్ టూవీలర్ల వాటా దాదాపు 25 శాతానికి, ఈవీ ప్యాసింజర్ కార్ల వాటా 15 శాతానికి చేరవచ్చని ఇండస్ట్రీ నిపుణులు అంచనా వేస్తున్నారు. మారుతీ, టయోట, హ్యుందాయ్, హీరో, బజాజ్, టీవీఎస్, హోండా తదితర ప్రధాన సంస్థలు ఈవీ మార్కెట్‌పై దృష్టి పెడితే దేశీయ ఈవీ మార్కెట్ పరుగులు పెడుతుందని కూడా వారు విశ్లేషిస్తున్నారు.

## వచ్చేవారం స్టాండర్డ్ గ్లాస్ ఐపీవో

హైదరాబాద్, జనవరి 1: రాష్ట్రానికి చెందిన స్టాండర్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ వచ్చేవారంలో ఐపీవోకి రాబోతున్నది. ఈ నెల 6 నుంచి 8 వరకు మూడు రోజుల వరకు షేర్లను విక్రయించడంతో రూ.410.05 కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. షేరు ధరల శ్రేణిని రూ.133-140గా నిర్ణయించింది. ఈ నూతన సంవత్సరంలో ఐపీవోకి వస్తున్న తొలి సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ కావడం విశేషం. ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో 1.43 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయిస్తున్నది. గతంలో 1.83 కోట్ల షేర్లను విక్రయించాలనుకున్నప్పటికీ దీనిని తగ్గించింది.

## లాభాల్లో సూచీలు

ముంబై, జనవరి 1: నూతన సంవత్సరం తొలిరోజు దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల్లో ముగిశాయి. మార్కెట్ ముగిసే సమయానికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 368.40 పాయింట్లు లాభపడి 78,507.41 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 98.10 పాయింట్లు అందుకొని 23,742.90 వద్ద స్థిరపడింది. కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ షేరు 3.26 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు మహీంద్రా అండ్ మహీంద్రా 2.45 శాతం, లార్సెన్ అండ్ టుబ్రో, బజాజ్ ఫైనాన్స్, టాటా మోటర్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్, పవర్‌గ్రిడ్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లు లాభాల్లో ముగిశాయి.

# తోళ్ల పరిశ్రమ అభివృద్ధికి సీఎల్‌ఆర్‌ఐతో జట్టు

## ఆరు లెదర్ పార్కుల అభివృద్ధికి చర్యలు



హైదరాబాద్, జనవరి 1 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఆరు లెదర్ పార్క్‌ల ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్నది. ఇందులోభాగంగా సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ పరిధిలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసర్చ్(సీఎస్ఐఆర్) అనుబంధ సంస్థ సెంట్రల్ లెదర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఎల్ఆర్ఐ-చెన్నై)తో తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్(టీజీఎల్ఐపీసీ)తో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఆరు లెదర్ పార్క్‌ల ఏర్పాటునకు సంబంధించి అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను కూడా రూపొందించారు. ఈ లెదర్ పార్క్‌ల్లో తోలు వస్తువులు, దుస్తులు, ఫర్నీచర్, ఫుట్‌వేర్ తదతర ఉత్పత్తులు చేయాలని నిర్ణయించారు. ఈ నేపథ్యంలో తాజాగా పోలేపల్లి(మహబూబ్‌నగర్), దండేపల్లి(నల్గొండ), మందమర్రి(మంచిర్యాల), జింకుంట(నాగర్‌కర్నూల్), రుక్మాపూర్(కరీంనగర్), మల్లెమడుగు(ఖమ్మం) తదితర ఆరు లెదర్‌పార్క్‌ల అభివృద్ధికి ప్రభుత్వం సీఎల్‌ఆర్‌ఐతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. పీపీపీ పద్ధతిన వీటిని ఏర్పాటు చేస్తున్నారు.

**బీఆర్‌ఎస్ హయాంలోనే ప్రణాళికలు..**

బీఆర్‌ఎస్ హయాంలోనే రాష్ట్రంలో పశువులు, గొర్రెల జనాభా గణనీయంగా పెరిగిన విషయం విదితమే. దీంతో మాంస వినియోగం, ఉత్పత్తిలో భారీగా వృద్ధి నమోదైంది. ముడి సరుకు కొరత లేకపోవడంతో తోళ్ల పరిశ్రమను అభివృద్ధి చేయడం ద్వారా వివిధ తోలు ఉత్పత్తులు ఇక్కడే తయారు చేయాలని గత బీఆర్‌ఎస్ సర్కారు నిర్ణయించింది. దీంతో వేలాదిమందికి ఉపాధి లభించే అవకాశం ఉండటంతో టీజీ ఎల్ఐపీసీవో ఆధ్వర్యంలో పీపీపీ పద్ధతిలో లెదర్‌పార్క్‌లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ క్రమంలోనే నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో 53 ఎకరాల్లో మెగా లెదర్ క్లస్టర్‌తోపాటు భూమి లభ్యత ఉన్న 12ప్రాంతాల్లో లెదర్‌పార్క్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించింది గత సర్కారు. వీటికి అవసరమైన భూములను కూడా సిద్ధం చేసింది.

# రికార్డుస్థాయికి ప్యాసింజర్ వాహనాల సేల్స్

**2024లో 43 లక్షల యూనిట్ల అమ్మకాలు**



న్యూఢిల్లీ, జనవరి 1: దేశవ్యాప్తంగా ప్యాసింజర్ వాహన విక్రయాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయి. గడిచిన సంవత్సరానికిగాను దేశీయంగా 43 లక్షల యూనిట్ల ప్యాసింజర్ వాహనాలు అమ్ముడయ్యాయి. వాహన దిగ్గజాలైన మారుతి సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటర్స్, టయోటా కిర్లోస్కర్ మోటర్, కియాలు అత్యధిక వార్షిక వృద్ధిని నమోదు చేసుకోవడం ఇందుకు కలిసొచ్చింది. పీవీల విక్రయాలు దూసుకోవడానికి ప్రధానంగా గ్రామీణ ప్రాంత మార్కెట్ చాలా కీలక పాత్ర పోషించిందని, 2023లో అమ్ముడైన 41.1 లక్షల యూనిట్లతో పోలిస్తే రెండంకెల వృద్ధి నమోదైందని మారుతి సుజుకీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. గతేడాదిలో మారుతి అత్యధికంగా 17,90,977 యూనిట్ల ప్యాసింజర్ వాహనాలను విక్రయించింది. చిన్న స్థాయి నగరాలు, పట్టణాల్లో సైతం రిటైల్ అవుట్‌లెట్లను తెరవడానికి తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని,

**గత ఏడాది కంపెనీల వాహన విక్రయాలు**

- మారుతి సుజుకీ 17,90,977 యూనిట్ల వాహనాలను విక్రయించింది.
- హ్యుందాయ్ మోటర్ ఇండియా అత్యధికంగా 6,05,433 యూనిట్ల అమ్మకాలు జరిపింది. వీటిలో ఎస్‌యూవీ వాహనాల వాటా 67.6 శాతంగా ఉన్నది.
- టాటా మోటర్స్ 5.65 లక్షల వాహనాలను విక్రయించింది.
- టయోటా కిర్లోస్కర్ మోటర్ రికార్డు స్థాయిలో గతేడాది 3,26,329 యూనిట్ల వాహన అమ్మకాలు జరిపింది. 2023లో విక్రయించిన 2,33,346 యూనిట్లతో పోలిస్తే 40 శాతం అధికం.

**డిసెంబర్‌లో వాహన అమ్మకాలు**

| సంస్థ | 2024 | 2023 | వృద్ధి (%లో) |
|---|---|---|---|
| మారుతి సుజుకీ | 1,78,248 | 1,37,551 | 30 |
| హ్యుందాయ్ | 55,078 | 56,450 | -2 |
| ఆడీ ఇండియా | 5,816 | 7,931 | -27 |
| టయోటా కిర్లోస్కర్ | 29,529 | 22,867 | 29 |
| మహీంద్రా | 69,768 | 41,424 | 16 |
| వీఈ కమర్షియల్ | 8,324 | 8,026 | 3.7 |
| నిస్సాన్ మోటర్ | 11,676 | 7,711 | 51.42 |
| జేఎస్‌డబ్ల్యూ ఎంజీ | 7,516 | 3,785 | 55 |
| బజాజ్ ఆటో | 3,23,125 | 3,26,806 | -1 |
| సుజుకీ మోటర్‌సైకిల్ | 96,804 | 78,834 | 22 |

# న్యూ ఇయర్ వేళ విషాదం

- నెత్తురోడిన రోడ్లు
- కారుఢీకొని వృద్ధ దంపతులు మృతి
- బైక్ ఢీకొని, అదుపు తప్పి మరో నలుగురు దుర్మరణం

ధర్మపురి/ పాలకుర్తి/ ఓదెల/ మేడిపల్లి/ సిరిసిల్ల తెలంగాణచౌక్, జనవరి1 : న్యూ ఇయర్ వేళ విషాదం నెలకొన్నది. రోడ్డు ప్రమాదాల రూపంలో మృత్యువు వెంటాడింది. వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఆరుగురు చనిపోవడం కలిచి వేసింది. జగిత్యాల జిల్లా ధర్మపురిలో బైక్‌పై చర్చికి వెళ్లొస్తూ వృద్ధ దంపతులు కారు ఢీకొని మృతిచెందగా, భీమారంలో బైక్ ఢీకొని వృద్ధుడు దుర్మరణం చెందాడు. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం జడీనగర్, ఓదెల, సిరిసిల్లలో ద్విచక్రవాహనం అదుపు తప్పి మరో ముగ్గురు దుర్మరణం చెందారు.

**చర్చికి వెళ్లొస్తూ..**



చంద్రయ్య (ఫైల్)



భాగ్యమ్మ (ఫైల్)

ధర్మపురి మండలం రామయ్యపల్లి గ్రామానికి చెందిన కూస చంద్రయ్య(60), కూస భాగ్యమ్మ(55) దంపతులు. నూతన సంవత్సరం సందర్భంగా ధర్మపురిలోని ఓ చర్చిలో ప్రార్థనలు చేసి తిరిగి అర్ధరాత్రి 2.30గంటల సమయంలో వారి మోపెడ్‌పై ఇంటికి వెళ్తున్నారు. పట్టణశివారులోని లక్ష్మీనరసింహకాలనీ వద్ద ఎదురుగా రాయపట్నం నుంచి జగిత్యాల వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. చంద్రయ్య అక్కడికక్కడే మృతి చెందగా, భాగ్యమ్మకు తీవ్రగాయాలయ్యాయి. జగిత్యాల దవాఖానకు తరలించగా, బుధవారం వేకువజామున మృతి చెందింది.

**బైక్ అదుపు తప్పి విద్యార్థి మృతి**



కౌశిక్‌హరినాథ్ (ఫైల్)

పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు నెరువట్ల తిరుపతి రెండో కొడుకు నెరువట్ల కౌశిక్‌హరినాథ్(15) బసంత్‌నగర్ ఐఎంఎస్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. న్యూ ఇయర్ సందర్భంగా బుధవారం తెల్లవారుజామున స్నేహితుడి బైక్‌పై బసంత్‌నగర్ నుంచి టోల్‌గేట్ వైపు వస్తుండగా, జీడీనగర్ బస్టాండ్ సమీపంలో వాహనం అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. కౌశిక్‌హరినాథ్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో పెద్దపల్లికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బసంత్‌నగర్ ఎస్ఐ స్వామి పేర్కొన్నారు.

**విధులు ముగించుకొని ఇంటికి వెళ్తూ..**



రవికిరణ్ (ఫైల్)

జమ్మికుంట మండలం కోరపల్లికి చెందిన తీగల రవికిరణ్ (30) ఓదెల మండలం కొలనూర్ టీజీ బ్యాంక్‌లో క్లర్క్‌గా పని పనిచేస్తున్నాడు. విధులు ముగించుకొని మంగళవారం రాత్రి ఇంటికి వెళ్తుండగా, ఓదెల శివారులో బైక్ అదుపు తప్పి కింద పడి అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. బంధువులు వెంటనే కరీంనగర్ దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ దీకొండ రమేశ్ పేర్కొన్నారు. రవి కిరణ్‌కు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

**స్నేహితులను కలిసి వస్తూ..**

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సర్ధాపూర్ గ్రామానికి చెందిన లింగంపల్లి అక్షయ్(21) న్యూ ఇయర్ సందర్భంగా స్నేహితుడు రవితో కలిసి వెంకటాపూర్‌లో ఉన్న ఫ్రెండ్స్ వద్దకు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రాయిని ఢీకొనగా అక్షయ్‌కు తీవ్రగాయాలు కాగా, రవికి స్వల్పగాయాలయ్యాయి. దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. సోదరుడు భరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ పేర్కొన్నారు.

**బైక్ ఢీకొని బాటసారి**



భూమారాజం(ఫైల్)

భీమారం మండల కేంద్రానికి చెందిన ఆకునూరి భూమారాజం (49) బస్టాండ్ నుంచి తన ఇంటికి నడుచుకుంటూ వస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఓ బాలుడు బైక్ అజాగ్రత్తగా నడుపుతూ భూమారాజంను ఢీ కొట్టాడు. తీవ్ర గాయాలై కింద పడిపోయాడు. స్థానికులు జగిత్యాల దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. భూమారాజంకు భార్య లత, కొడుకు శివ ఉన్నాడు. లత ఫిర్యాదు మేరకు మైనర్‌కు బండి ఇచ్చిన గండి వంశీతోపాటు బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్యామ్‌రాజ్ తెలిపారు.

## బీసీ మహాసభకు తరలిరావాలి

బీసీ సంఘం నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

హుజూరాబాద్ టౌన్, జనవరి 1: హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద శుక్రవారం నిర్వహించే బీసీ మహాసభకు పార్టీలకతీతంగా బీసీలు కదలిరావాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా బీసీ సంఘం సభ్యుడు సాయి కృష్ణ పిలుపునిచ్చారు. హుజూరాబాద్ పట్టణంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో బీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ అమలు చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తే బీసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయకుంటే బీసీ మహాసభ ద్వారా జాగృతమై కాంగ్రెస్‌పై బీసీలందరం యుద్ధం ప్రకటిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తులసీ లక్ష్మణమూర్తి, చిలుకమారి శ్రీనివాస్, గడ్డం రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ రథం వితరణ

మానకొండూర్ రూరల్, జనవరి 1: కొండపల్కల గ్రామానికి చెందిన కేశిరెడ్డి భాగ్యలక్ష్మి-మల్లారెడ్డి దంపతులు తమ కొడుకు కృష్ణ చైతన్య జ్ఞాపకార్థం బుధవారం గ్రామానికి ₹3లక్షల విలువైన వైకుంఠ రథాన్ని వితరణ చేశారు. మొదటగా కొడుకు విగ్రహం వద్ద జయంతి నిర్వహించారు. తర్వాత గ్రామ పంచాయతీకి వైకుంఠరథాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుర్రాల వెంకట రెడ్డి, నాయకులు గడ్డం మార్కండేయులు, గట్టు శ్రీధర్, కడారి రమేశ్, గోగుల వీరేశం, కంది వీరారెడ్డి, మాడ రాజిరెడ్డి పాల్గొన్నారు.



ఎన్టీపీసీ జడ్పీహెచ్ఎస్‌లో ఉదయం విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఉపాధ్యాయులు (ఫైల్)

# సర్కారు బడుల్లో 'ఫేషియల్' అటెండెన్స్

- టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కోసం ప్రభుత్వం సరికొత్త యాప్
- రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఇటీవలే ప్రారంభం
- కలెక్టర్ శ్రీహర్ష చేపట్టిన డీహెచ్ఎస్ఐఎస్ స్ఫూర్తిగా అమలు
- స్కూల్‌కు 50 మీటర్ల దూరంలో ఉంటేనే ఓపెన్..
- ఉదయం, సాయంత్రం ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తేనే హాజరు



**సర్కారు బడుల్లో ప్రభుత్వం సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, నాన్‌టీచింగ్ సిబ్బంది విధుల నిర్వహణలో పారదర్శకత కోసం..? ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్)ను అమల్లోకి తెచ్చింది. పాఠశాలకు సమయానికి వస్తున్నారా..? సరిగ్గా విధులు నిర్వర్తిస్తున్నారా..? అని తెలుసుకునేందుకు ఆరు నెలల క్రితం కలెక్టర్ కోయ శ్రీ హర్ష ప్రారంభించిన డైలీ హెచ్ఎం అండ్ స్టాఫ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (డీహెచ్ఎస్ఐఎస్) సక్సెస్ కాగా, ఈ కార్యక్రమ స్ఫూర్తిగా ఈ విధానాన్ని సర్కారు తీసుకొచ్చింది. స్కూల్‌కు 50 మీటర్ల దూరంలో ఉంటేనే ఓపెన్ అయ్యేలా ఈ అప్లికేషన్‌ను తీర్చిదిద్దగా, ఉదయం, సాయంత్రం ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తేనే హాజరు నమోదుకానున్నది.**

పెద్దపల్లి కమాన్, జనవరి 1 : జిల్లాలోని 524 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 31,200 మంది విద్యనభ్యసిస్తుండగా, దాదాపు 2500 మందికి పైగా బోధన, బోధనేతర సిబ్బంది పనిచేస్తున్నారు. అయితే కొద్దిరోజుల క్రితం పాఠశాలల నిర్వహణ గాడి తప్పగా, కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రత్యేక చొరవ తీసుకున్నారు. హెచ్ఎంలు, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది సమయానికి వస్తున్నారా ..? పిల్లలతో సమయానికి ప్రార్థన చేయిస్తున్నారా ? టీచర్లు టైం టేబుల్ ప్రకారం బోధన చేస్తున్నారా..? మధ్యాహ్న భోజనం టైంకు పెడుతున్నారా ?' అనే విషయాలను ప్రతి రోజు తెలుసుకునేందుకు వినూత్న కార్యక్రమానికి సంకల్పించారు. రాష్ట్రంలోనే ఎక్కడా లేనివిధంగా గత సెప్టెంబర్ 24న పెద్దపల్లి జిల్లా విద్యాశాఖ పరిధిలో డైలీ హెచ్ఎం అండ్ స్టాఫ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (డీహెచ్ఎస్ఐఎస్) పేరిట కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. సిబ్బంది హాజరు, రోజువారీగా కార్యక్రమాలను ఫొటోలు తీసి, ఉదయం, సాయంత్రం ఆన్‌లైన్‌లో గూగుల్ ఫారం ద్వారా జిల్లా విద్యాశాఖాధికారి (పెద్దపల్లి) లింకులో ఆయా స్కూల్స్ హెచ్ఎంలు, ప్రిన్సిపాల్స్ అప్‌లోడ్ చేయాలని ఆదేశాలు జారీ చేయగా, అప్పటి నుంచి మార్పు మొదలైంది. కార్యక్రమం సత్ఫలితాలనిచ్చింది. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు సమయానికి మధ్యాహ్న భోజనం అందింది.

**పైలెట్ ప్రాజెక్టుగా ఎఫ్ఆర్ఎస్..**

కలెక్టర్ ప్రారంభించిన డీహెచ్ఎస్ఐఎస్ సక్సెస్ కావడం, ఉపాధ్యాయులు, సిబ్బంది సమయపాలన తీరు రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు స్ఫూర్తిగా నిలిచింది. స్కూళ్ల నిర్వహణ మెరుగుపడింది. ఈ కార్యక్రమ స్ఫూర్తిగా టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కోసం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో ఈ నెల 17న ఎఫ్ఆర్ఎస్ (ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్)కు శ్రీకారం చుట్టింది. రాష్ట్రంలోనే పైలెట్ ప్రాజెక్టు కింద చేపట్టగా, ఇక్కడ విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నది.

**లోపలికి వస్తే క్లాక్ ఇన్..**

**బయటికి వెళ్లే క్లాక్ అవుట్**

టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది తమ మొబైల్‌లోని ప్లే స్టోర్ ద్వారా డీఎస్ఈ-ఎఫ్ఆర్ఎస్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతి స్కూల్‌కు ఒక యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ఉంటుంది. ఉదయం స్కూల్‌కు రాగానే తమ మొబైల్‌లో యాప్‌ను ఓపెన్ చేసుకోగానే, ఒక సర్కిల్ వస్తుంది. అందులో ఫొటో దిగడంతో క్లాక్ ఇన్ అని పడుతుంది. విధులు ముగించుకొని ఇంటికి వెళ్లేటప్పుడు మళ్లీ ఫొటో దిగడంతో క్లాక్ అవుట్ అని పడుతుంది. ప్రతి స్కూల్ జియో (JEO) కోఆర్డినేట్స్ పరిధిలో ఉంటుంది. అయితే స్కూల్‌కి 50 మీటర్ల పరిధి వరకే పని చేస్తుంది. టీచర్లు, సిబ్బంది స్కూల్‌కు రాకున్నా, దూరంగా ఉన్నా ఓపెన్ కాదు. గైర్హాజరైనట్లుగానే పరిగణించాల్సి ఉంటుంది.



ముత్తారం కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినిలో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

**మంచి ఫలితాలు వస్తాయి..**

టీచింగ్, నాన్‌టీచింగ్ సమయపాలన పాటిస్తే మంచి ఫలితాలు వస్తాయి. తరగతులు సక్రమంగా జరుగుతాయి. స్కూల్ నిర్వహణ బాగుంటుంది. గతంలో కలెక్టర్ శ్రీకారం చుట్టిన కార్యక్రమం సక్సెస్ అయింది. మంచి మార్పు కనిపించింది. కొత్తగా తీసుకువచ్చిన ఎఫ్ఆర్ఎస్ యాప్‌తోనూ రిజల్ట్ బాగుంటుంది.

- డీ మాధవి, డీఈవో (పెద్దపల్లి)